# ప్రభాత సూర్యుడు
తెలుగు దినపత్రిక

RANGAREDDY, EDITION : 01, VOLUME : 57, EDITOR:CHERUKU UPENDAR, DATE : WEDNESDAY 21 JUNE 2023 PAGES:4, RATE: Rs.5/-

రంగారెడ్డి సంపుటి : 01 సంచిక : 57, ఎడిటర్ : చెరుకు ఉపేందర్ తేదీ : బుధవారం 21 జూన్ 2023 పేజీలు : 4 వెల : 5/-


## తెలంగాణ సర్కార్ నయా ప్లాన్..

### ఆ 'గుడ్లు' ఇక మాయం కావు..!



హైదరాబాద్ - ప్రభాత సూర్యుడు

అవినీతి, అక్రమాలకు చెక్ పెట్టేందుకు తెలంగాణ సర్కార్ నిత్యం వినూత్నమైన కార్యక్రమాలు చేపడుతోంది. అంగన్వాడీ కేంద్రాలకు చేరాల్సిన గుడ్లు దారిమళ్లుతున్నాయంటూ ఆరోపణలు వెల్లువెత్తుతున్న నేపథ్యంలో మిగతా 3లో...

## కాంగ్రెస్‌లో... ఎన్నికల జోష్..!



హైదరాబాద్- ప్రభాత సూర్యుడు

కర్నాటక ఎన్నికలలో విజయం సాధించిన తర్వాత ఉల్లాసంగా ఉన్న కాంగ్రెస్, అధికార భారత రాష్ట్ర సమితి (బిఆర్ఎస్) నుండి అసమ్మతి నేతలను ఆకర్షించడం ద్వారా తెలంగాణలో తన పునాదిని బలోపేతం చేసుకునే ప్రయత్నాలను వేగవంతం చేసింది. తెలంగాణలో అసెంబ్లీ ఎన్నికలకు 5-6 నెలల సమయం ఉన్నందున, కర్ణాటక ఎన్నికల ఫలితాలతో దూకుడుగా ఉన్న బీజేపీపై ఆ పార్టీ పైచేయి సాధించినట్టు కనిపిస్తోంది. ఇటీవల బీఆర్ఎస్, ఇతర పార్టీల నుంచి నాయకులు చేరడంతో బీఆర్ఎస్‌కు కాంగ్రెస్ ప్రధాన సవాల్‌గా మారడం ప్రారంభించిందని, రెండు దఫాలు అధికారంలోకి వచ్చిన తర్వాత అధికార వ్యతిరేకతను ఎదుర్కొనే అవకాశం ఉందని రాజకీయ పరిశీలకులు అంటున్నారు. గత కొన్ని రోజులుగా.. గతంలో బీజేపీకి ప్రాధాన్యత ఇస్తున్నట్లు కనిపిం మిగతా 2లో...

## మరో 3 రోజులు వడగాల్పులు

హైదరాబాద్ - ప్రభాత సూర్యుడు



తెలంగాణలో రాగల మూడు రోజుల్లో వడగాలులు వీచే అవకాశం ఉందని వాతావరణ కేంద్రం ఆరెంజ్ అలర్ట్ జారీ చేసింది. ప్రజలు పగటిపూట బయటకు రావొద్దని సూచించింది. తెలంగాణలో ఎండలు మండిపోతున్నాయి. రాష్ట్రంలో మరో మూడు రోజులపాటు వగాలులు వీచే అవకాశం ఉందని భారత వాతావరణ శాఖ ప్రకటించింది. తెలంగాణలోని పలు జిల్లాలకు వాతావరణశాఖ ఆరెంజ్ అలర్ట్ జారీచేసింది. ఆదిలాబాద్, ఆసిఫాబాద్, మంచిర్యాల, నిర్మల్, జగిత్యాల, కరీంనగర్, పెద్దపల్లి, భూపాలపల్లి, ములుగు, భద్రాద్రి కొత్తగూడెం, ఖమ్మం, నల్లగొండ, సూర్యాపేట, వరంగల్, మహబూబాబాద్, హన్మకొండ జిల్లాల్లో రాగల మూడు రోజులపాటు తీవ్ర వడగాలులు వీచే అవకాశం ఉందని ఐఎండీ అధికారులు హెచ్చరించారు. రాగల మూడు రోజులపాటు అత్యవసరమైతే తప్ప పగటిపూట ప్రజలు ఇళ్ల నుంచి బయటికి రావొద్దని అధికారులు హెచ్చరించారు.. రాగల మూడు రోజులు ఎండలు తీవ్ర స్థాయిలో మిగతా 2లో...

## అక్టోబర్‌లో తెలంగాణ అసెంబ్లీ ఎన్నికల షెడ్యూల్

హైదరాబాద్ - ప్రభాత సూర్యుడు



ఎన్నికలకు ముందు అధికార యంత్రాంగం భారీగానే సన్నద్ధం కావాల్సి ఉంటుంది. పోలింగ్ స్టేషన్ల ఏర్పాటు, ఓటర్ల జాబితా రెడీ చేయడం, నియోజకవర్గాల వారీగా ఆర్వోలను నియమకం. సమస్యాత్మ ప్రాంతాలను గుర్తించి అక్కడ సెక్యూరిటీని ఏర్పాటు చేయడం కూడా ఇప్పటి నుంచే మొదలు పెట్టాలి. ఆరు నెలల ముందు నుంచే ఎన్నికల్లో విధులు నిర్వహించడానికి ఒకే చెప్పి వారికి ట్రైనింగ్ కూడా ఇవ్వాల్సి ఉంటుంది. ఈసారి అదనపు జిల్లా కలెక్టర్లకి కూడా బాధ్యతలు అప్పగించాలని ఎన్నికల సంఘం భావిస్తోంది. 74 మంది డిప్యూటీ కలెక్టర్లు, 14 మంది డిప్యూటీ కమిషనర్లు, 31 మంది అదనపు కలెక్టర్ల లిస్టును రెడీ చేసింది. 119 అసెంబ్లీ నియోజకవర్గాల పరిధిలో ఉన్న మండల తహసీల్దార్లకు అసిస్టెంట్ రిటర్నింగ్ అధికారులుగా విధులు అలాట్ చేయనున్నారు. వీళ్లు నామినేషన్లు స్వీకరించడం, పోలింగ్ సామగ్రిని సరఫరాల చేయడం, పోలింగ్ బూత్‌ల ఏర్పాటు, ఈవీఎంలు, బ్యాలెట్ పేపర్లు రెడీ చేస్తారు. అక్టోబర్ 4న ఓటర్ల తుది జాబితాను ప్రచురిస్తారు. ఆ తర్వాతే షెడ్యూల్ వస్తుందని అధికారులు చెబుతున్నారు. 2018లో తెలంగాణ ప్రభుత్వం ముందస్తు ఎన్నికలకు వెళ్లింది. 2019 ఏప్రిల్‌లో ఎన్నికలు జరగాల్సి ఉండగా... 2018 సెప్టెంబర్ 6 న ప్రభుత్వాన్ని రద్దు చేసి ముందస్తుకు వెళ్లారు సీఎం కేసీఆర్. అప్పటికి ఉన్న రాజకీయ పరిస్థితుల కారణంగా ముందస్తుకు వెళ్లారు. ఆ సమయంలోనే నాలుగు రాష్ట్రాల ఎన్నికలు కూడా ఉన్నందున వాటితోపాటు తెలంగాణ అసెంబ్లీకి కూడా ఎన్నికల షెడ్యూల్‌ను ఈసీ ప్రకటించింది. అక్టోబర్ 6న ఎన్నికల షెడ్యూల్ వచ్చింది. నవంబర్ 12న నోటిఫికేషన్ జారీ చేశారు. డిసెంబర్ 7న పోలింగ్ నిర్వహించారు. 11న ఓట్ల లెక్కింపు మిగతా 2లో...

## ఇంటింటికి బీజేపీ...

### ఒకే రోజు 35 లక్షల కుటుంబాలను కలవాలని ప్లాన్


హైదరాబాద్ - ప్రభాత సూర్యుడు



కేంద్రంలో ప్రధాని నరేంద్ర మోదీ నాయకత్వంలోని ప్రభుత్వం అధికారంలోకి వచ్చి తొమ్మిదేళ్లు పూర్తయ్యాయి. తొమ్మిదేళ్ల పాలనను పూర్తి చేసుకున్న సందర్భంగా 'ఇంటింటికీ బీజేపీ' కార్యక్రమాన్ని చేపట్టింది బీజేపీ. ఇందులో భాగంగా తెలంగాణ బీజేపీ నేతలు జూన్ 22న రాష్ట్రంలో ఒకే రోజు మిగతా 2 లో...

## ప్రజా పార్టీ" పేరుతో కొత్త పార్టీ గద్దర్ కీలక నిర్ణయం

న్యూఢిల్లీ-ప్రభాత సూర్యుడు



"గద్దర్ ప్రజా పార్టీ" పేరుతో గద్దర్ కొత్త పార్టీ పెడుతు న్నారు. పార్టీ రిజిస్ట్రేషన్ కోసం ఆయన ఢిల్లీ వెళ్తున్నారు. ఈసీ అధికారులను కలిసి కొత్త పార్టీ రిజిస్ట్రేషన్ ప్రారంభించను న్నారు. గద్దర్ విప్లవానికి పోరా టానికి ప్రతీక. అందువల్లే "గద్దర్ ప్రజా పార్టీ" జెండాను మూడు రంగులతో రూపొందించినట్లు తెలుస్తోంది. అలాగే జెండా మధ్యలో పిడికిలిని పెట్టారని సమాచారం. ఈ మూడు రంగుల్లో ఎరుపు, నీలి, ఆకుపచ్చ రంగులతో రూపొందించారనే ప్రచారం మిగతా 2లో...

## విద్యారంగంలో తెలంగాణ మోడల్




హైదరాబాద్ - ప్రభాత సూర్యుడు

నిర్మల్ జిల్లా కేంద్రంలో విద్యా దినోత్సవం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో భాగంగా.. మన ఊరు-మన బడి పాఠశాల, నూతనంగా నిర్మించిన రాంనగర్, సోఫినగర్ పాఠశాలను అటవీ, పర్యావరణ, న్యాయ, దేవాదాయ శాఖ మంత్రి ఇంద్రకరణ్ రెడ్డి ప్రారంభించారు. తెలంగాణ స్వరాష్ట్రంగా ఆవిర్భవించిన తర్వాత ప్రభుత్వ విద్యారంగాన్ని మిగతా 2లో...

## ఈటల బీజేపీకి దూరమవుతున్నారా..!

### బీజేపీ పార్టీలో అసలేం జరుగుతోంది..!?

హైదరాబాద్ - ప్రభాత సూర్యుడు



ఈటల రాజేందర్ ఎందుకో మౌనం పాటిస్తున్నారు..! ఇదివరకు న్యట్లుగా చురుగ్గా ఉండట్లేదు..! అసలు ఈ మధ్య ఎక్కడా కనిపించట్లేదు..! ఇవీ ఆయన అభిమానులు, అనుచరులు, కార్యకర్తల్లో వినివస్తున్న మాటలు. గులాబీ పార్టీకి గుడ్ బై చెప్పి కాషాయ కండువా కప్పుకున్నాక హైపర్ యాక్టివ్‌గా ఉన్న ఈటల సడన్‌గా డీలా పడిపోయారు.. సీఎం కేసీఆర్ అంటే చాలు ఒంటి కాలిపై లేచే ఈయన ఎందుకిలా మారి పోయారు..! బీజేపీ పార్టీ కార్యక్రమాల్లో కూడా ఎందుకు పాల్గొనట్లేదు..? కనీసం మీడియా ముందుకు కూడా ఎందుకు రావట్లేదో ఎవరికీ అర్థం కాని పరిస్థితి..!

**అసలు బీజేపీ పార్టీలో జరుగుతోంది..!?**

కేసీఆర్‌పై తిరుగుబావుటా ఎగరేసి 'కారు' దిగి బీజేపీ తీర్థం పుచ్చుకున్నాక తెలంగాణ రాజకీయాల్లో కీలక పరిణామాలుంటాయని కమలనాథులు భావించారు. ఉద్యమనేత కావడం, మిగతా 2లో...

## విచారణకు బీఆర్ఎస్ నేతలకు ఐటీ నోటీసులు

హైదరాబాద్ - ప్రభాత సూర్యుడు



ఐటీ విచారణకు రావాలంటూ బీఆర్ఎస్ నేతలకు నోటీసులు అందాయి. 84 గంటల పాటు పైళ్ల శేఖర్‌రెడ్డి, మర్రి జనార్దన్‌రెడ్డి ఇళ్లు, కార్యాలయాల్లోనూ ఐటీ ముమ్మర తనిఖీలు నిర్వహించింది. సోదాల్లో స్వాధీనం చేసుకున్న పలు డాక్యుమెంట్స్, ఆన్‌లైన్ ట్రాన్సాక్షన్స్ ఆధారంగా పైళ్ల శేఖర్‌రెడ్డికి ఐటీ నోటీసులు జారీ చేసింది. నేడు సంబంధిత వివరాలు, ఆధారాలతో హైదరాబాద్‌లోని ఐటీ ఆఫీస్‌లో విచారణకు హాజరు కావాలని నోటీసుల్లో ఐటీ అధికారులు పేర్కొన్నారు. శేఖర్‌రెడ్డితోపాటు జనార్ధన్‌రెడ్డి, ఎంపీ కొత్త ప్రభాకర్‌రెడ్డికి కూడా నోటీసులు ఇచ్చినట్లు సమాచారం. అయితే నేడు ఐటీ ముందు ఎంపీ కొత్త ప్రభాకర్ రెడ్డి హాజరు కానున్నారు. మర్రి జనార్దన్ రెడ్డి సమయం కోరనున్నారు. ఎమ్మెల్యే పైళ్ల శేఖర్ రెడ్డిని గురువారం హాజరు కావాలని ఐటీ అధికారులు నోటీసుల్లో పేర్కొన్నారు.అధికార బీఆర్ఎస్ పార్టీ నేతలను ఆదాయ పన్ను (ఐటీ) శాఖ అధికారులు హడలెత్తించారు. 50 బృందాలుగా ఏర్పడిన అధికారులు ఏకకాలంలో బీఆర్ఎస్ ఎంపీ, ఇద్దరు ఎమ్మెల్యేలు, మరో నాయకుడి ఇళ్లలో సోదాలు చేశారు. మెదక్ ఎంపీ కొత్త ప్రభాకర్‌రెడ్డి, మిగతా 2లో...

## రూ.2000 నోట్ల ఉపసంహరణతో భారీగా తగ్గిన డిజిటల్ పేమెంట్లు



న్యూఢిల్లీ - ప్రభాత సూర్యుడు

రూ.2000 నోట్ల ఉపసంహరణ తో సందేహాలు, అనుమానాలు వ్యక్తమవుతున్న వేళ ప్రభుత్వరంగ బ్యాంక్ ఎస్‌బిఐ కీలక రిపోర్ట్ విడుదల చేసింది. దేశంలో డిపాజిట్లు, రుణాలు, వినియోగంపై ఈ పెద్ద నోటు ఉపసంహరణ గణనీయ ప్రభావాన్ని చూపుతుందని అంచనా వేసింది. వినియోగ మిగతా 2లో...

## వీసీపై వేటు.. అధికారం ఎవరికి



నిజామాబాద్- ప్రభాత సూర్యుడు

త్యం వివాదాలతో వార్తల్లో నిలుస్తుంది నిజామాబాద్ లోని తెలంగాణ విశ్వవిద్యాలయం. గత కొన్ని రోజులుగా ఉపకులపతికి వ్యతిరేకంగా బోధనా సిబ్బంది, మిగతా 3లో...

### అక్టోబర్‌లో తెలంగాణ
## అసెంబ్లీ ఎన్నికల షెడ్యూల్

(మొదటిపేజీ తరువాయి)

జరిగింది. ఆ ఎన్నికల్లో బీఆర్ఎస్ భారీ విజయాన్ని నమోదు చేసింది. ఈసారి కూడా ఆ నాలుగు రాష్ట్రాలతో కలిపి తెలంగాణ అసెంబ్లీ ఎన్నికలను నిర్వహించే అవకాశాలు ఉన్నాయి. ఛత్తీస్‌గఢ్, మధ్యప్రదేశ్, మిజోరం, రాజస్థాన్‌కు తెలంగాణ తోపాటు ఎన్నికలు జరగబోతున్నాయి. 2018లో ముందస్తు అసెంబ్లీ ఎన్నికలకు వెళ్లిన కేసీఆర్.. ప్రభుత్వ రద్దు ప్రకటనతోపాటే ఆ ఎన్నికల్లో పార్టీ తరపున పోటీచేసే అభ్యర్థుల పేర్లను కూడా ప్రకటించేశారు. అప్పుడు ఎన్నికలకు సుమారు మూడు నెలల ముందే ఒకేసారి 105 మంది జాబితాను విడుదల చేయడం సంచలనం సృష్టించింది. అదే తరహాలో ఈసారి అసెంబ్లీ ఎన్నికలకు మూడు నెలల ముందే అభ్యర్థులను ప్రకటించేలా కేసీఆర్ కసరత్తు చేస్తున్నారు. వచ్చే ఎన్నికల్లో పోటీ కోసం బీఆర్ఎస్‌లో తీవ్రపోటీ నెలకొనడం, సిట్టింగ్ ఎమ్మెల్యేల్లో పనిమంతులకే తిరిగి టికెట్ దక్కుతుందని ఇప్పటికే స్పష్టతనిచ్చారు. చివరి నిమిషంలో టిక్కెట్లు ఖరారు చేస్తే అసంతృప్తి ప్రభావం చూపిస్తుందని మూడు నెలల ముందుగానే చెబితే.. వెళ్లేవాళ్లు వెళ్తారని ఉండేవాళ్లు ఉంటారని అనుకుంటున్నట్లుగా బీఆర్ఎస్ ఉన్నత స్థాయి వర్గాలు చెబుతున్నాయి.

### మరో 3 రోజులు
## వడగాల్పులు

(మొదటిపేజీ తరువాయి)

ఉంటాయని హెచ్చరించారు. నేడు, రేపు ఆదిలాబాద్, కొమరం భీమ్ ఆసిఫాబాద్, మంచిర్యాల, నిర్మల్, జగిత్యాల, కరీంనగర్, పెద్దపల్లి, జయశంకర్ భూపాలపల్లి, ములుగు, భద్రాద్రి కొత్తగూడెం, ఖమ్మం, నల్గొండ, సూర్యాపేట, మహబూబాబాద్, వరంగల్, హన్మకొండ జిల్లాలలో కొన్ని ప్రాంతాలలో వడగాలులు వీచే అవకాశం ఉందని అంచనా వేశారు అధికారులు. ఎల్లుండి రాష్ట్రంలో ఆదిలాబాద్, కొమరం భీమ్ ఆసిఫాబాద్, మంచిర్యాల, నిర్మల్, నిజామాబాద్, భద్రాద్రి, ఖమ్మం, నల్గొండ, సూర్యాపేట జిల్లాలలో అక్కడక్కడ వడగాలులు వీచే అవకాశం ఉందని పేర్కొన్నారు. నైరుతి రుతుపవనాలు మరో రెండు, మూడు రోజులలో దక్షిణ భారతదేశంలోని మరికొన్ని భాగాలకు విస్తరించే అవకాశాలు ఉన్నాయని తెలిపారు. ప్రస్తుతం దిగువ స్థాయిలోని గాలులు వాయవ్య, పశ్చిమ దిశల నుంచి తెలంగాణ వైపునకు వీస్తున్నాయని వెల్లడించారు.ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్రంలో నైరుతి రుతుపవనాలు విస్తరించేందుకు అనుకూల పరిస్థితులు ఉన్నాయని అంచనా వేసింది. ఈ నెల 21 నుంచి తిరుపతి, సత్యసాయి, అన్నమయ్య, తిరుపతి, వైఎస్సార్, చిత్తూరు జిల్లాలో చాలా చోట్ల తేలికపాటి నుంచి మోస్తారు వర్షాలు కురుస్తాయని... అక్కడక్కడ భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని తెలిపింది. కోస్తాంధ్రలో కొన్నిచోట్ల ఉరుములు, మెరుపులతో కూడిన వర్షాలు పడతాయని పేర్కొంది. ఇక అటు తెలంగాణ లో కూడా కూడా ఈ నెల 21 నుంచి వర్షాలు ఉన్నట్లు హైదరాబాద్ వాతావరణ కేంద్రం ప్రకటన చేసింది. నెల్లూరు తీరానికి దగ్గరలో ఉపరితల ఆవర్తనం ఏర్పడినట్లు ఏపీ వెదర్ మెన్ పేర్కొంది. నెల్లూరు, తిరుపతి జిల్లాల్లోని తీర ప్రాంతల్లో మరికొద్ది గంటల్లో చినుకులు, తేలికపాటి వర్షాలు కురుస్తాయని అంచనా వేసింది. ప్రస్తుతానికి తూర్పు రాయలసీమ జిల్లాలు, దక్షిణ కోస్తాంధ్రలో ఆకాశం పూర్తి స్థాయిలో మేఘావృతం అయ్యి ఉంది. కానీ రాత్రి సమయం వెళ్లేసరికి, తిరుపతి, చిత్తూరు జిల్లాల్లో ఇవాళ వర్షాలు జోరందుకుంటాయని వివరించింది. తమిళనాడు సరిహద్దు ప్రాంతాల్లో ఉన్న ప్రదేశాల్లో అధిక వర్షపాతం నమోదవ్వనుంది.

### ప్రజా పార్టీ" పేరుతో కొత్త పార్టీ
## గద్దర్ కీలక నిర్ణయం

(మొదటిపేజీ తరువాయి)

జరుగుతోంది. ఎందుకంటే గద్దర్ తన ప్రయాణాన్ని ఎరుపురంగుతో ప్రారంభించారు. గద్దర్ మొదటగా అంబేద్కరిస్టు.. కాలానుగుణంగా ఆయన వామపక్ష రాజకీయాలపై ఆకర్షితులయ్యారు. అందుకే నీలి రంగు కూడా జెండాలో తప్పకుండా ఉంటుందని భావిస్తున్నారు.గత కొద్ది రోజులుగా రాష్ట్ర రాజకీయాల్లో గద్దర్ ప్రధాన ఆకర్షణగా నిలుస్తున్నారు. ఆ మధ్య వచ్చే పార్లమెంట్ ఎన్నికల్లో పెద్దపల్లి లోక్‌సభ స్థానం నుంచి పోటీ చేస్తారని ప్రచారం జరిగింది కూడా. స్వరాష్ట్రంలో ప్రస్తుత పరిస్థితి, నిరుద్యోగ సమస్య, కల్యాణలక్ష్మి, షాదీ ముబారక్ పథకాల తీరు, ధరణి పోర్టల్ వల్ల ప్రజలు పడుతున్న బాధలను.. 'నన్ను గన్న తల్లుల్లారా' అనే బాణిలో వివరిస్తూ బీఆర్ఎస్ ప్రభుత్వ వైఫల్యాలను బట్టబయలు చేస్తున్నారు. ఈ క్రమంలోనే గద్దర్.. సీఎం కేసీఆర్‌పై పోటీ చేస్తారనే ప్రచారం కూడా జరిగింది. ఆయన కాంగ్రెస్ చేరి ఆ పార్టీ నుంచే పోటీ చేస్తారని అందరూ అనుకున్నారు. పోరు బాటకు పొద్దు పొడుపు. నిద్రాణమైన తెలంగాణకు మేలుకొలుపు. బానిసలారా లెండిరా అంటూ బహుజనులను జాగృతం చేసినా.. అమ్మా తెలంగాణమా అని ప్రజల గోసను గానం చేసినా.. పొడుస్తున్న పొద్దుతో పోటీ పడి ఉద్యమాన్ని రగిలించినా.. అది గద్దర్‌కే సొంతం. గద్దర్ పాట విని ఎగిరి దుంకని పల్లె లేదంటే అతిశయోక్తి కాదు. పాటతోనే ప్రస్థానాన్ని ప్రారంభించి.. పాటతోనే ప్రజా ప్రస్థానాన్ని ముగిస్తానని చెప్పిన గద్దర్ అని పిలువబడే విఠల్ రావు ఇప్పుడు కొత్త పార్టీకి అంకురార్పణ చేస్తున్నారు. ఇప్పటికే పార్టీకి సంబంధించిన విధివిధానాలను ఆయన రూపొందుకున్నట్లు తెలుస్తోంది. ఎందుకంటే పార్టీ పేరు, జెండాను ఆయన రూపొందించారు కూడా.

# కాంగ్రెస్‌లో ఎన్నికల జోష్

(మొదటిపేజీ తరువాయి)

చిన తిరుగుబాటు బీఆర్ఎస్ నాయకులను కూడా ఆకర్షించడంలో కాంగ్రెస్ విజయం సాధించింది రాజకీయ విశ్లేషకుల అభిప్రాయం ప్రకారం.. కర్ణాటక ఫలితం తర్వాత చాలా మంది నాయకులు తమ మనస్సును మార్చుకున్నారు. పార్టీ కేంద్ర, రాష్ట్ర నాయకత్వం కూడా సాధారణ చర్చల ద్వారా స్థిరమైన ప్రయత్నాలు చేసింది. ఎన్నికలు సమీపిస్తున్న తరుణంలో కాంగ్రెస్ మరింత మంది నేతలను తన శిబిరంలోకి ఆకర్షించే అవకాశం ఉంది. "బీఆర్ఎస్, బీజేపీకి చెందిన పలువురు అసమ్మతి నేతలు కూడా కాంగ్రెస్‌లో చేరే అవకాశం ఉంది. కొన్నేళ్ల క్రితం కాంగ్రెస్‌ను వీడిన వారు కూడా తిరిగి రావచ్చు" అని విశ్లేషకుడు పాల్వాయి రాఘవేంద్రరెడ్డి అన్నారు. 2014, 2018 ఎన్నికల్లో పరాజయాలు, ఫిరాయింపులు, ఉప ఎన్నికల్లో పేలవమైన పనితీరు, గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ (జిహెచ్ఎంసి) అంతర్గత పోరు ఉన్నప్పటికీ రాష్ట్రంలో కాంగ్రెస్ బలమైన శక్తిగా కొనసాగుతుందని ఆయన అభిప్రాయపడ్డారు కొన్ని జిల్లాలకే పరిమితమైన బీజేపీకి భిన్నంగా, రాష్ట్రవ్యాప్తంగా కాంగ్రెస్‌కు ఇప్పటికీ బలమైన ఉనికి ఉంది. "కొందరు నాయకులు వెళ్లి ఉండవచ్చు, కానీ పార్టీ కార్యకర్తలు ఇప్పటికీ గ్రౌండ్‌లో చురుకుగా ఉన్నారు" అని కాంగ్రెస్ సీనియర్ నాయకుడు, మాజీ మంత్రి మహమ్మద్ అలీ షబ్బీర్ అన్నారు. ఖమ్మం మాజీ ఎంపీ పొంగులేటి శ్రీనివాసరెడ్డి, మాజీ మంత్రి జూపల్లి కృష్ణారావుతో కలిసి కాంగ్రెస్ పెద్ద విజయం సాధించినట్టు తెలుస్తోంది. పార్టీ వ్యతిరేక కార్యకలాపాలకు సంబంధించి ఇద్దరు నాయకులను ఏప్రిల్‌లో బీఆర్ఎస్ సస్పెండ్ చేసింది. శిబిరంలో చేరడానికి వారిని ఒప్పించేందుకు బిజెపి తీవ్ర ప్రయత్నాలు చేసింది.పార్టీ జాయినింగ్ కమిటీకి నేతృత్వం వహిస్తున్న ఎమ్మెల్యే ఈటల రాజేందర్ చేతులు దులుపుకోవడంతో బీజేపీ తన ప్రయత్నాల్లో విఫలమైందని స్పష్టమైంది. ఇరువురు నేతలతో కొన్ని దఫాలుగా చర్చలు జరిపిన మాజీ మంత్రి.. బీఆర్ఎస్‌ను అధికారం నుంచి గద్దె దింపేందుకు తమతో చేతులు కలపాలని ఇద్దరు నేతలు తనను ఒప్పించేందుకు ప్రయత్నించారని వెల్లడించారు. 2021లో ముఖ్యమంత్రి కె. చంద్రశేఖర్‌రావు రాష్ట్ర మంత్రివర్గం నుంచి తనను తప్పించడంతో బిఆర్ఎస్‌ను విడిచిపెట్టి బిజెపిలో చేరిన రాజేందర్, మరికొందరు నేతలు రాష్ట్ర బిజెపి అధ్యక్షుడు బండి సంజయ్ కుమార్ పనితీరుపై అసంతృప్తితో ఉన్నట్లు సమాచారం. రాహుల్‌కి షర్మిల బర్త్‌డే విషెస్.. విలీనానికి సూచనేనా? కర్నాటక ఎన్నికలలో పార్టీ ఓటమి తర్వాత బిజెపి శ్రేణులలో అసమ్మతి నివేదికలు కూడా వెలువడ్డాయి. ఇది బీఆర్ఎస్ అసమ్మతివాదులను ఆకర్షించడానికి పార్టీ ప్రయత్నాలను దెబ్బతీసింది. ఈ నెలాఖరులో ఖమ్మంలో నిర్వహించే బహిరంగ సభలో రాహుల్ గాంధీ సమక్షంలో శ్రీనివాసరెడ్డి కాంగ్రెస్ పార్టీలో చేరనున్నారు. సభకు మూడు లక్షల మందిని సమీకరించేందుకు పార్టీ ప్రయత్నిస్తోంది. శ్రీనివాస రెడ్డి ఖమ్మం, పరిసర జిల్లాల్లో ప్రభావవంతమైన నేతగా పరిగణించబడుతుండడంతో ఇది కాంగ్రెస్‌కు పెద్ద బూస్ట్‌గా మారనుంది. కాంగ్రెస్ తెలంగాణ అధ్యక్షుడు ఎ. రేవంత్ రెడ్డి జూన్ 17న శ్రీనివాస రెడ్డితో చర్చలు జరిపారు. ఇద్దరు నేతలు కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి ప్రియాంక గాంధీతో ఫోన్‌లో మాట్లాడినట్లు సమాచారం. గతంలో ఖమ్మం జిల్లాలోని 10 అసెంబ్లీ స్థానాల్లో ఎనిమిది స్థానాల్లో తన మద్దతుదారులకే టిక్కెట్లు కేటాయించాలన్న శ్రీనివాసరెడ్డి డిమాండ్‌ను కాంగ్రెస్ అంగీకరించినట్లు సమాచారం. ఈ 10 స్థానాల్లో 2019 ఎన్నికల్లో కాంగ్రెస్ ఏడు స్థానాలు, తెలుగుదేశం పార్టీ (టీడీపీ) రెండు స్థానాల్లో విజయం సాధించాయి. బీఆర్ఎస్ ఒక్క సీటు మాత్రమే గెలుచుకోగలిగింది. అయితే, ఐదుగురు కాంగ్రెస్ ఎమ్మెల్యేలు ఆ తర్వాత బీఆర్ఎస్‌లోకి ఫిరాయించారు. 2014లో వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ టిక్కెట్‌పై ఖమ్మం నుంచి లోక్‌సభకు ఎన్నికైన శ్రీనివాస్‌రెడ్డి ఆ తర్వాత టీఆర్ఎస్ (ప్రస్తుతం బీఆర్ఎస్)లోకి మారారు. బీఆర్ఎస్ నాయకత్వం అనేక వాగ్దానాలు చేసిందని, వాటిని నెరవేర్చడంలో విఫలమైందని ఆరోపించారు. గత అసెంబ్లీ, లోక్‌సభ ఎన్నికలకు కేసీఆర్ తనకు పార్టీ టిక్కెట్ నిరాకరించడంతో ఆయన అసంతృప్తిగా ఉన్నారు. ఈ ఏడాది జనవరి 18న ఖమ్మంలో బీఆర్ఎస్ ఆధ్వర్యంలో నిర్వహించిన బహిరంగ సభకు కూడా తనకు ఆహ్వానం అందకపోవడంతో తిరుగుబాటు బావుటా ఎగురవేశారు. బీఆర్ఎస్ పేరు మార్చిన తర్వాత ఇది మొదటి సభ. పార్టీలో చేరుతున్న మరో కీలక వ్యక్తి మాజీ మంత్రి జూపల్లి కృష్ణారావు. 2018లో మహబూబ్‌నగర్ జిల్లాలోని కొల్లాపూర్ నియోజకవర్గంలో తనను ఓడించిన ఎమ్మెల్యే హర్షవర్ధన్ రెడ్డి అసెంబ్లీ ఎన్నికల తర్వాత కాంగ్రెస్ నుండి బీఆర్ఎస్‌లోకి మారడంతో ఆయన బీఆర్ఎస్‌లో పక్కకు తప్పుకున్నారు. కొన్ని నెలల క్రితం నియోజకవర్గ అభివృద్ధిపై చర్చకు హర్షవర్ధన్‌రెడ్డిని కృష్ణారావు ధైర్యంగా నిలదీశారు. 2011లో కాంగ్రెస్‌కు రాజీనామా చేసిన కృష్ణారావు టీఆర్ఎస్‌లో చేరడం శుభపరిణామం. 2014లో కొల్లాపూర్ నుంచి టీఆర్ఎస్ టిక్కెట్‌పై ఎన్నికయ్యారు. ఆయన చేరికతో కొల్లాపూర్, వనపర్తి సెగ్మెంట్లలో కాంగ్రెస్ ఉనికికి బలం చేకూరుతుందని భావిస్తున్నారు. మహబూబ్‌నగర్‌కు చెందిన మరికొందరు బీఆర్ఎస్ నేతలు కూడా కాంగ్రెస్‌లో చేరే అవకాశం ఉంది. తెలంగాణ శాసనమండలి సభ్యుడు కూచుకుళ్ల దామోదర్ రెడ్డి నెలాఖరులోగా కాంగ్రెస్‌లో చేరే అవకాశం ఉంది. కొడంగల్ నుంచి ఐదుసార్లు ఎమ్మెల్యేగా గెలిచిన గురునాథ్ రెడ్డి కూడా కాంగ్రెస్‌లో చేరాలని భావిస్తున్నారు. మహబూబ్ నగర్ జిల్లాకు చెందిన రేవంత్ రెడ్డి టీపీసీసీ చీఫ్ గా జిల్లాకు చెందిన ఇతర పార్టీల నేతలతో మంతనాలు జరిపి వారిని కాంగ్రెస్ లో చేరేలా చేయాలని చూస్తున్నారు. జూన్ 15న బీఆర్ఎస్‌కు చెందిన ఇద్దరు సీనియర్ నేతలు కాంగ్రెస్‌లో చేరడంతో కాంగ్రెస్‌కు గట్టి ఎదురుదెబ్బ తగిలింది. అటవీశాఖ మంత్రి ఎ. ఇంద్రకరణ్‌రెడ్డి ప్రాతినిధ్యం వహిస్తున్న నిర్మల్ నియోజకవర్గానికి చెందిన కూచాడి శ్రీహరిరావు తన అనుచరులతో కలిసి కాంగ్రెస్‌లో చేరారు. గతంలో టీడీపీ, ఆ తర్వాత బీఆర్ఎస్‌లో ఉన్న మరో సీనియర్ నేత నోముల ప్రకాశరావు కూడా కాంగ్రెస్‌లో చేరారు. రేవంత్ రెడ్డి.. ఈ చేరికలు కాంగ్రెస్ బలాన్ని చాటుతున్నాయన్నారు. తెలంగాణలో కాంగ్రెస్ అధికారంలోకి రావడం ఖాయమన్నారు. తెలంగాణలోని నాలుగు కోట్ల మంది ప్రజలు బీఆర్ఎస్ మితిమీరిన పాలన, దుష్పరిపాలన కారణంగా కేసీఆర్ ప్రభుత్వాన్ని గద్దె దించే అవకాశం కోసం ఎదురు చూస్తున్నారని అన్నారు. ఇవి కేవలం చేరికలు కాదని, ప్రజా వ్యతిరేక బీఆర్ఎస్ ప్రభుత్వాన్ని తినేసే అలలు అని ఆయన పేర్కొన్నారు.

# ఈటల బీజేపీకి దూరమవుతున్నారా..!

(మొదటిపేజీ తరువాయి)

స్రీనియర్ నేతగా ఉండటంతో ఈయన తర్వాత భారీగానే చేరికలు ఉంటాయని రాజేందర్ కోసం ప్రత్యేకంగా ప్రపంచంలో ఎక్కడాలేని 'చేరికల కమిటీ'ని ఏర్పాటు చేసి.. దానికి ఛైర్మన్‌గా నియమించడం జరిగింది. అయితే.. చేరికల సంగతి దేవుడెరుగు కానీ.. ఒకరిద్దరితో తప్పితే కాషాయ కండువా కప్పించలేకపోయారు. ఎవర్ని టచ్ చేసినా 'పార్టీలోకి వస్తే నాకేంటి..? టికెట్ ఇస్తారా లేదా.. లేకపోతే నాకిచ్చే పదవేంటి..?' అని అడుగుతున్నారని ఎలాంటి హామీ ఇవ్వలేకపోవడంతో పార్టీలోకి రావడానికి సాహసించట్లేదని అప్పట్లో ఈటల తన ప్రధాన అనుచరులతో చెప్పారని లీకులు వచ్చాయి. అంతేకాదు.. 'ప్రపంచంలో ఎక్కడైనా చేరికల కమిటీ ఉంటుందా!. ఏదో నాకు చేరికల కమిటీ ఛైర్మన్ అని ఇచ్చారు. నేను అర్థం చేసుకునే నాయకుడిని కాబట్టి దానికి న్యాయం చేసే ప్రయత్నం చేశాను' అని తన అత్యంత సన్నిహితుల దగ్గర ఆవేదన వ్యక్తం చేశారట. అప్పట్లో ఈ వ్యవహారం పెద్ద రచ్చే అయ్యింది. ఆ తర్వాత అదేమీ లేదని వివరణ ఇచ్చుకున్న ఈటల.. వరుసగా ఢిల్లీ పర్యటనలు.. ఆ తర్వాత అస్సాం పర్యటనలతో యమా యాక్టివ్ అయ్యారు. సీన్ కట్ చేస్తే.. ఇవాళో, రేపో రాజేందర్‌కు ప్రమోషన్ వస్తోందని.. కీలక పదవి వరించబోతోందని వార్తలొచ్చాయి. ఇంతవరకూ అడ్రస్ లేదు. ఆయన అక్కడ ఢిల్లీలోనే ఉండగానే బండి సంజయ్ వర్గం వ్యతిరేకంగా భేటీ అయ్యింది. అటు పదవి రాక.. ఇటు సొంత పార్టీలో వర్గ విభేధాలతో ఈటల బాగా డీలా పడిపోయారని తెలుస్తోంది.

'ఈటెల రాజేందర్ కనపడుట లేదు' ఇప్పుడు ఈ మాటలు సొంత పార్టీ నేతలు, కార్యకర్తలే సోషల్ మీడియాలో పోస్టులు చేసి రెచ్చగొడుతున్నారట. పైగా బీజేపీ నిర్వహిస్తున్న కార్యక్రమాలకు కూడా దూరంగా ఉంటుండటంతో అసలేం జరుగుతోందో కార్యకర్తలకు, అభిమానులకు అర్థం కావట్లేదట. అయితే ఈటలను అగ్రనేతలు గట్టిగానే మందలించారని అందుకే ఈ పరిస్థితులు వచ్చాయనే చర్చ కూడా నడుస్తోంది. అధ్యక్ష పదవి ఆశించిన ఈటలకు.. 'అసెంబ్లీ ఎన్నికలయ్యే వరకు అధ్యక్ష పదవి మార్పు ఉండదు' అని స్పష్టం చేయడంతో అలిగారట. అందుకే పార్టీ కార్యక్రమాలకు, మీడియాకు దూరంగా ఉంటున్నట్లు విశ్వసనీయ వర్గాల సమాచారం. కేంద్రం ఇచ్చిన నిధులు, ధరణి విషయంలో ఇంత రచ్చ జరుగుతున్నా రాజేందర్ ఎక్కడా కనిపించలేదు. అంతేకాదు.. కేంద్రమంత్రి కిషన్ రెడ్డి నిర్వహించిన ఓ కార్యక్రమానికి ఈటల డుమ్మా కొట్టడంతో తెలంగాణ రాజకీయాల్లో సర్వత్రా చర్చనీయాంశం అయ్యారు.

ఆ మధ్య బీఆర్ఎస్ బహిష్కృత నేతలు పొంగులేటి శ్రీనివాసరెడ్డి, జూపల్లి కృష్ణారావులను బీజేపీలోకి ఆహ్వానించే టైమ్‌లో తనకు రివర్స్ కౌన్సిలింగ్ ఇస్తున్నారంటూ నిర్వేదపు వ్యాఖ్యలు చేశారు. ఆ తర్వాత కర్ణాటక ఎన్నికల ఫలితాలు రావడంతో పొంగులేటి, జూపల్లే కాదు ఇంతవరకూ ఏ ఒక్కరూ బీజేపీవైపు తొంగిచూడలేదు. ఇచ్చిన పదవికి న్యాయం చేయలేక.. ఇటు పార్టీలో గుర్తింపు లేక.. పదవి ఇస్తున్నట్లు వార్తలొచ్చి ఆ తర్వాత ఏమీ లేక.. ఇలా వరుస పరిణామాలతో ఈటల డీలా పడిపోయారట. మరోవైపు.. బీజేపీకి బై బై చెప్పి కాంగ్రెస్‌లో చేరినా ఆశ్చర్యపోనక్కర్లేదేమో అని కామెంట్స్ సోషల్ మీడియాలో వినిపిస్తున్నాయి. ఈ పరిస్థితుల్లో ఈటల యాక్టివ్ అవుతారో లేకుంటే మౌనంగానే ఉండిపోతారో.. ఇవన్నీ కాదని పార్టీ మారుతారో తెలియాలంటే మరికొన్నిరోజులు ఆగాల్సిందే మరి.

# విద్యారంగంలో తెలంగాణ మోడల్

(మొదటిపేజీ తరువాయి)

బలోపేతం చేయటానికి సీయం కేసీఆర్ అనేక చర్యలు తీసుకున్నారని ఇంద్రకరణ్ రెడ్డి అన్నారు. గురుకులాలు అద్భుతమైన ఫలితాలకు కేరాఫ్ అడ్రస్‌గా మారయని తెలిపారు. విద్యారంగంలో తెలంగాణ దేశానికే రోల్‌మోడల్‌గా మారుతున్నదని పేర్కొన్నారు. దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా నిర్వహిస్తున్న విద్యాదినోత్సవం సందర్భంగా 'మన ఊరు-మన బడి' కార్యక్రమంలో నిర్మల్ పట్టణంలో నూతనంగా నిర్మించిన రాంనగర్, సోఫినగర్ పాఠాశాలను మంత్రి ఇంద్రకరణ్ రెడ్డి ప్రారంభించారు.తెలంగాణ రాష్ట్రంలో విద్యారంగం ప్రగతిబాటలో ముందుకు సాగుతున్నదని, తొమ్మిదేళ్ళలో ఊహించని విధంగా విద్యాభివృద్ధిలో పురోగతి సాధించిందని పేర్కొన్నారు. ప్రైవేటు, కార్పొరేట్ విద్యారంగాన్ని తలదన్నేలా ప్రభుత్వ పాఠశాలలు, కాలేజీల్లో విద్యా బోధన, మౌలిక వసతులు కల్పిస్తున్నామని తెలిపారు. సీఎం కేసీఆర్ దూరదృష్టితో గ్రామీణులకు, పేదలకు నాణ్యమైన ఇంగ్లిష్ మీడియం విద్యను అందుబాటులోకి తీసుకొచ్చారు. ఒకపక్క ప్రభుత్వ పాఠశాలలను బలోపేతం చేస్తూ.. మరోపక్క సంక్షేమశాఖలవారీగా కొత్తగా గురుకుల పాఠశాలలను నెలకొల్పుతూ సత్ఫలితాలు సాధిస్తున్నామని వివరించారు. అవతరణ దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా రాష్ట్ర వ్యాప్తంగా ప్రభుత్వ పాఠశాలలో చదువుతున్న దాదాపు 25 లక్షల మంది విద్యార్థులకు రూ. 140 కోట్లతో రెండు జతల యూనిఫామ్స్, రూ. 190 కోట్లతో ఉచితంగా టెక్స్ట్ బుక్స్, సంవత్సరం పొడవునా రూ. 35 కోట్ల ఖర్చుతో రాగి జావా ఇవ్వాలని ముఖ్యమంత్రి కె. చంద్రశేఖర్ రావు నిర్ణయించారని పేర్కొన్నారు. 12 లక్షల 50 వేల మంది విద్యార్థులకు రూ. 56 కోట్ల విలువ గల నోట్ బుక్స్, 34.25 కోట్ల విలువ చేసే ట్యాబ్స్ 19,800 మంది టీచర్స్‌కు అందించనున్నామని వెల్లడించారు.

## ఇంటింటికి బీజేపీ...

(మొదటిపేజీ తరువాయి)

35 లక్షల కుటుంబాలను కలవాలని ప్లాన్ చేశారు. పోలింగ్ బూత్ అధ్యక్షుడి నుంచి రాష్ట్ర అధ్యక్షుడి వరకు నేతలంతా ఓటర్ల ఇళ్లకు వెళ్లనున్నారు. ఒక్కో బూత్ ప్రెసిడెంట్ కనీసం 100 కుటుంబాలను కలుస్తారు ఆ పార్టీ నాయకులు తెలిపారు. రాష్ట్ర స్థాయి నాయకులు ఆయా నియోజకవర్గాల్లోని కుటుంబాలను కలిసి మోదీ పాలన, ఏం చేశారు.. ఏం చేయనున్నారు అనే అంశాలపై వెల్లడించనున్నారు. జూన్ 22 ఉదయం 7 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు నేతలు కుటుంబాలను కలుస్తారు. తెలంగాణ వ్యాప్తంగా 35 లక్షల బూత్ కమిటీలు ఉన్నాయని.. వాటి కేంద్రంగా 'ఇంటింటికీ బీజేపీ' కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని వ్యూహం రచించించారు బీజేపీ నాయకులు. ప్రధాని మోదీ నేతృత్వంలో జరిగిన అభివృద్ధి కార్యక్రమాలను ప్రజలకు వివరించనున్నారు.కరీంనగర్ అసెంబ్లీ నియోజకవర్గంలోని చైతన్యపురిలోని కుటుంబాలను ఆ పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు బండి సంజయ్ కలవనున్నారు. అదేవిధంగా కేంద్ర మంత్రి జి. కిషన్‌రెడ్డితోపాటు ఇతర సీనియర్ నేతలు కూడా తమ నియోజకవర్గంలోని ప్రజలను కలిసి ప్రధాని మోదీ ఈ తొమ్మిదేళ్లలో ఏం చేశారో చెప్పనున్నారు. మహాజనసంపర్క్ యాత్రలో భాగంగా బీజేపీ నేతలు జూన్ 22 నుంచి 30 వరకు ప్రజలను కలుస్తున్నారు.నెహ్రూ, ఇందిర తర్వాత.. తొలి దఫా కన్నా రెండోదఫాలో ఎక్కువ సీట్లు సాధించిన నేతగా నరేంద్రమోదీ రికార్డు సృష్టించారు. రాజీవ్‌గాంధీ తర్వాత సింగిల్ పార్టీ ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసిన నాయకుడాయన. దేశాన్ని అన్ని విధాలుగా ముందుకు తీసుకువెళ్లాలంటే.. ఒక విజన్ ఉండాలి. ముందు అన్ని వర్గాలను ఒక్కతాటిపైకి తీసుకురావాలి. వాస్తవానికి అత్యంత సంక్లిష్టమైన ఈ దేశాన్ని ఒక్కతాటిపై ముందుకు తీసుకెళ్లడం మామూలు విషయం కాదు. గొప్ప సంకల్పబలం ఉన్న నాయకులకైనా అంతకుమించిన సమస్యలు ఎదురవుతాయి. ప్రస్తుతం నరేంద్రమోదీ అదే దశలో ఉన్నారు. అసలే ప్రపంచ ఆర్థికమాంద్యం, ఇంతలో కరోనా వైరస్ కలగలసి- దేశాన్ని సుడిగుండంలోకి నెడుతున్న పరిస్థితి. ఈ నైరాశ్యాన్ని తరిమికొట్టడానికి నరేంద్రమోదీ- హెర్క్యులస్‌లా ముందు నిలబడ్డారు. ఇంతటి ప్రతికూల పరిస్థితుల్లోనూ- భారత్‌ను గ్లోబల్ లీడర్‌గా చేయాలన్న ఆశలను, ఆశయాలను వదిలపెట్టని విక్రమార్కుడిలా ముందుకు వెళ్తున్నారు మోదీ.

### విచారణకు బీఆర్ఎస్ నేతలకు
## ఐటీ నోటీసులు

(మొదటిపేజీ తరువాయి


భువనగిరి ఎమ్మెల్యే పైళ్ల శేఖర్‌రెడ్డి, నాగర్‌కర్నూలు ఎమ్మెల్యే మర్రి జనార్దన్‌రెడ్డి, బీఆర్ఎస్ ముషీరాబాద్ నియోజకవర్గ నాయకుడు కొండపల్లి మాధవ్ (ఈయన 20 ఏళ్లు బీజేపీలో ఉన్నారు) ఇళ్లలో దాడులు చేశారు. ఆదాయ పన్ను లెక్కల్లో తేడాలుండడంతోనే ఈ సోదాలు చేసినట్లు సమాచారం. అయితే ఒకేసారి ముగ్గురు నేతల ఇళ్లలో ఐటీ దాడులు జరగడంతో బీఆర్ఎస్ నేతలు ఆందోళన చెందుతున్నారు. రెండేళ్ల కిందట కూడా బీఆర్ఎస్ నేతలకు ఐటీ అధికారులు షాక్ ఇచ్చారు. అప్పుడు కొందరు ఎమ్మెల్యేలకు నోటీసులు జారీ చేశారు. సోదాలు పెద్దఎత్తున జరగకపోయినప్పటికీ ఎమ్మెల్యేలు, ఎంపీలు ఆందోళన చెందారు.

# సంపాదకీయం

## దుమ్మురేపుతున్న తెలుగు విద్యార్థులు

దేశంలో ఏ జాతీయస్థాయి పరీక్షలు జరిగిన తెలుగు విద్యార్థులు సత్తా చాటుతున్నారు. టాప్ ర్యాంకులతో దూసుకుపోతున్నారు. జేఈఈ, నీట్, యూపీఎస్సీ పరీక్షలలో టాప్ ర్యాంకులతో దుమ్ము రేపారు. ముఖ్యంగా జేఈఈ మెయిన్, నీట్, జేఈఈ అడ్వాన్స్‌డ్ ఫలితాల్లో ప్రథమ ర్యాంకులను తెలుగు రాష్ట్రాల విద్యార్థులే దక్కించుకొని జాతీయస్థాయిలో ప్రత్యేకతను సాధించారు. ఏప్రిల్ 30న వెల్లడైన జేఈఈ మెయిన్‌లో హైదరాబాద్‌కు చెందిన సింగరాజు వెంకట కౌండిన్య 300కి 300 మార్కులు దక్కించుకొని మొదటి ర్యాంకు సాధించగా.. జూన్ 13న వెల్లడైన నీట్-యూజీ ఫలితాల్లో ఏపీలోని శ్రీకాకుళానికి చెందిన బోర వరుణ్ చక్రవర్తి 720కి 720 మార్కులతో ప్రథమ ర్యాంకు పొందాడు. తాజాగా జేఈఈ అడ్వాన్స్‌డ్ ఫలితాల్లో హైదరాబాద్‌కు చెందిన వావిలాల చిద్విలాస్‌రెడ్డి 360కి 341 మార్కులు సాధించి తొలి ర్యాంకు కైవసం చేసుకున్నాడు. మరోవైపు బాలికల విభాగంలో 298 మార్కులతో హైదరాబాద్ జోన్‌కు చెందిన నాగ భవ్యశ్రీ బాలికల విభాగంలో ప్రథమ స్థానంలో నిలవడం విశేషం. అయితే జాతీయ స్థాయిలో 56వ ర్యాంకులో నిలిచింది. జేఈఈ అడ్వాన్స్‌డ్‌లో గత కొద్ది సంవత్సరాలుగా తగ్గుతూ వచ్చిన కటాఫ్ మార్కులు ఈసారి మాత్రం భారీగా పెరిగాయి. 2021లో 360 మార్కులకు కటాఫ్ 63 మార్కులుగా, 2022లో 360కి 55 మార్కులుగా ఉంది, అయితే ఈసారి కటాఫ్ మార్కులు ఏకంగా 86కు పెరగడం విశేషం. 2021, 22 సంవత్సరాల్లో కరోనా ప్రభావంతో విద్యార్థులు తగినంత ప్రతిభ చూపలేకపోయారని నిపుణులు చెబుతున్నారు. గతేడాదితో పోల్చితే ఈసారి పరీక్ష కఠినంగా ఉందని భావించినప్పటికీ.. అందుకు భిన్నంగా విద్యార్థులు మార్కులు సాధించారు. గతానికి భిన్నంగా ఈసారి పోటీపడిన వారి సంఖ్య భారీగా పెరిగింది. అడ్వాన్స్‌డ్‌లో కూడా నెగ్గగలమన్న ధీమా కూడా విద్యార్థుల్లో పెరిగింది. ముఖ్యంగా అమ్మాయిలు కూడా ఆత్మవిశ్వాసంతో పోటీపడ్డారు. దానికితోడు భౌతికశాస్త్రంలో ఈసారి 6 మార్కులు కలపడం కలిసొచ్చింది. ఈ ఏడాది కేటగిరీల వారీగా కటాఫ్ మార్కులను జనరల్-86, ఓబీసీ-77, ఈడబ్ల్యూఎస్-77, ఎస్సీ-43, ఎస్టీ-43గా నిర్ణయించారు. ఐఐటీల్లో బీటెక్ సీట్ భర్తీకి నిర్వహించిన జేఈఈ అడ్వాన్స్‌డ్ ఫలితాలను జూన్ 18న విడుదల చేసిన సంగతి తెలిసిందే. జూన్ 4న జరిగి పరీక్షకు దాదాపు 1.80 లక్షల మంది విద్యార్థులు హాజరయ్యారు. వీరిలో 1,39,727 మంది అబ్బాయిలు ఉండగా.. 40,645 మంది అమ్మాయిలు ఉన్నారు. ఈ ఏడాది జేఈఈ అడ్వాన్స్‌డ్ ఫలితాల్లో మొత్తం 43,773 మంది అర్హత సాధించారు. వీరిలో అబ్బాయిలు 36,264 మంది, అమ్మాయిలు 7,509 మంది ఉన్నారు. తెలుగు రాష్ట్రాల నుంచి జేఈఈ అడ్వాన్స్‌డ్ పరీక్షకు 30 వేల మంది విద్యార్థులు హాజరయ్యారు ఈ పరీక్షలో కటాఫ్ మార్కులు నిర్ణయించి సుమారు 45 వేల మందిని జాయింట్ సీట్ అలకేషన్ అథారిటీ కౌన్సిలింగ్‌కు అర్హత కల్పిస్తారు. ఇక ఆల్ ఇండియా పబ్లిక్ సర్వీసెస్ రిక్రూట్‌మెంట్‌కు సంబంధించి యూపీఎస్సీ నిర్వహించిన సివిల్ సర్వీసెస్ పరీక్షల తుది ఫలితాలు వెలువడ్డాయి. టాప్ 4 ర్యాంకులు అమ్మాయిలు హస్తగతం చేసుకోగా, తెలుగు విద్యార్థులు ఉత్తమ ప్రతిభ కనబరిచారు. యూనియన్ పబ్లిక్ సర్వీస్ కమిషన్ నిర్వహించిన సివిల్ సర్వీసెస్ పరీక్షలు ఫైనల్ రిజల్ట్స్ వచ్చేశాయి. తెలుగు విద్యార్థులు అత్యుత్తమ ప్రతిభ కనబర్చడమే కాకుండా మంచి ర్యాంకులు సాధించారు. ఓవరాల్‌గా దేశవ్యాప్తంగా మొదటి నాలుగు ర్యాంకుల్ని అమ్మాయిలే కైవసం చేసుకోవడం విశేషం. ఆల్ ఇండియా ఫస్ట్ ర్యాంకర్‌గా ఇషితా కిశోర్, రెండవ ర్యాంకర్‌గా గరిమా లోహియా, మూడవ ర్యాంకర్‌గా ఉమా హారతి, నాలుగవ ర్యాంకర్‌గా స్మృతి మిశ్రా నిలిచారు. దేశవ్యాప్తంగా మొత్తం 933 మందిని యూపీఎస్సీ ఎంపిక చేయగా అందులో ఐఏఎస్ విభాగానికి 180 మంది, ఐఎఫ్ఎస్ విభాగానికి 38, ఐపీఎస్ విభాగానికి 200 మంది ఎంపికయ్యారు. రిజర్వేషన్ల ప్రకారమైతే జనరల్ కోటాలో 345, ఓబీసీలో 263, ఈడబ్ల్యూఎస్‌లో 99, ఎస్సీలో 154, ఎస్టీలో 72 మంది ఉన్నారు. సివిల్ సర్వీసెస్ ఫలితాల్లో తెలుగు విద్యార్థులు సత్తా చాటారు. పెద్దఎత్తున ర్యాంకులు కైవసం చేసుకున్నారు. నారాయణపేటకు చెందిన ఉమా హారతి ఆల్ ఇండియా మూడవ ర్యాంకు సాధించారు. తెలుగు రాష్ట్రాల్లో టాప్ ర్యాంకర్ ఈమెనే. తిరుపతికి చెందిన పవన్ దత్తా 22వ ర్యాంకు సాధించారు. రాజమండ్రికి చెందిన తరుణ్ పట్నాయక్ 33వ ర్యాంకు సాధించారు. వరంగల్‌కు చెందిన అర్పిత్ 40వ ర్యాంకు పొందారు. తెలుగు విద్యార్థులు దక్కించుకున్న ఇతర ర్యాంకులు ఇలా ఉన్నాయి..

## ఒరిస్సా రైలు ప్రమాదంఇంకా దొరకని సిగ్నల్ ఇంజనీర్



భువనేశ్వర్ - ప్రభాత సూర్యుడు

ఇటీవల ఒడిశా రైలు ప్రమాదం దేశవ్యాప్తంగా కలచివేసిన సంగతి తెలిసిందే. అయితే ఈ ఘటనపై ప్రస్తుతం సీబీఐ అధికారులు విచారణ జరుపుతున్నారు. ఈ నేపథ్యంలో బాలోసోర్‌లోని సోరో సెక్షన్ సిగ్నల్ జూనియర్ ఇంజినీర్ ఇంటికి సీలు వేశారు. అయితే ఇంతకుముందే ప్రాథమిక విచారణలో భాగంగా సోరో సెక్షన్ సిగ్నల్ జూనియర్ ఇంజినీర్‌ను సీబీఐ అధికారులు ప్రశ్నించారు. ఇప్పుడు మరింత సమాచారం కోసం మళ్లీ బాలాసోర్ వెళ్లారు. అక్కడ ఉండే ఈ జూనియర్ ఇంజనీర్‌ను ప్రశ్నించేందుకు వెళ్లారు. కాని అతను కనిపించలేదు. కుటుంబ సభ్యులతో సహా కనపడకుండా పోయినట్లు తెలిసింది. దీంతో అధికారులు అతను ఉంటున్న ఇంటిని సీజ్ చేశారు. మరో విషయం ఏంటంటే రైలు కార్యకలాపాలకు సంబంధించి సిగ్నల్ ఇంజనీర్‌గా పని చేసే వాళ్ల పాత్రే కీలకం. సిగ్నల్, ఇంటర్‌లాకింగ్ సిస్టమ్స్‌తో పాటు పలు వ్యవస్థల నిర్వహణ వీళ్ల పర్యవేక్షణలోనే ఉంటుంది. అందుకే సీబీఐ అధికారులు జూనియర్ ఇంజనీర్‌పై కూడా విచారణ చేపట్టారు. అయితే అతను కుటుంబంతో సహా ఎందుకు కనిపించకుండా వెళ్లిపోయారనే విషయంపై అధికారులు అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు.

### రూ.2000 నోట్ల ఉపసంహరణతో

# భారీగా తగ్గిన డిజిటల్ పేమెంట్లు

(మొదటిపేజీ తరువాయి)

డిమాండ్ రూ.55 వేల కోట్ల మొత్తంలో పెరగొచ్చని విశ్లేషించింది. రూ.2 వేల నోటు ఉపసంహరణ ఫలితాల్లో వినియోగ డిమాండ్ తక్షణం పెరుగుదల ఒకటని తెలిపింది. నోట్ల రద్దు మాదిరిగా కాకుండా రూ.2 వేల నోట్లు చట్టబద్ధంగా చెల్లుబాటు అవుతాయి కాబట్టి ఆర్థిక వ్యవస్థలో వినియోగానికి ఊతమిస్తుందని ఎస్‌బీఐ రిపోర్ట్ లెక్కగట్టింది. బంగారు, నగలు, ఏసీ, మొబైల్ ఫోన్లు, రియల్ ఎస్టేట్ వంటి అధిక వ్యాల్యూ ఉన్న వస్తువుల కొనుగోళ్లు పెరుగుతాయని తెలిపింది. ఉదాహరణకు నగదు లావాదేవీలు గణనీయంగా పెరిగాయి. పెద్ద ఎత్తున రూ.2 వేల నోట్లు చెలామణిలోకి వచ్చాయి. ఆలిండియా పెట్రోలియం డీలర్స్ అసోసియేషన్ (ఎఖఅం) విడుదల చేసిన రిపోర్ట్ ఇందుకు అద్దం పడుతోంది. రూ.2 నోట్ల ఉపసంహరణకు ముందు అమ్మకాల్లో 40 శాతంగా ఉన్న డిజిటల్ పేమెంట్లు భారీగా తగ్గాయని వివరించింది.

**క్యాష్ ఆన్ డెలివరీల్లో పెరుగుదల..**

పెద్ద నోటు ఉపసంహరణ తర్వాత క్యాష్ ఆన్ డెలివరీలు కూడా పెరిగాయి. క్యాష్ ఆన్ డెలివరీపై ఆర్డర్లు చేసే వారి సంఖ్య పెరిగిందని ఎస్బీఐ రిపోర్ట్ పేర్కొంది. జొమాటో యూజర్లలో 75 శాతం క్యాష్ ఆన్ డెలివరీ ఆప్షన్ ఎంచుకుంటుండగా.. వారిలో రూ.2 వేల నోట్లు చెల్లిస్తున్నవారు కూడా ఉన్నారు. ఇక గృహోపకరణాల విక్రయాలు కూడా పెరిగాయని ఎస్‌బీఐ రిపోర్ట్ ప్రస్తావించింది. రూ.2 వేల నోటు ఉపసంహరణ కారణంగా దేశంలో నగదుపై పెద్దగా ప్రభావం చూపబోదని చెప్పింది. ఇక రుణాల పరంగా చూస్తే.. డిపాజిట్లలో 30 శాతం అంటే దాదాపు రూ.92,000 కోట్లు రుణాలకు పోయే అవకాశం ఉందని వివరించింది. మున్ముందు కూడా రుణ జారీ పెరిగే అవకాశముందని విశ్లేషించింది. మొత్తంగా జీడీపీ వృద్ధి రేటుకు ఇది సానుకూలమవుతుందని తెలిపింది.

# తెలంగాణ సర్కార్ నయా ప్లాన్..

(మొదటిపేజీ తరువాయి)

రాష్ట్ర ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. గుడ్లు పక్కదారి పట్టకుండా ఉండేందుక.. రంగుల ముద్రలు వేయాలని నిర్ణయించింది సర్కార్. జోన్ నెంబర్ సహా నీలం, ఎరుపు, ఆకుపచ్చ రంగులను గుడ్లకు వేసేలా ఏర్పాట్లు చేసింది. అంగన్వాడీ కేంద్రాల్లో చిన్నారులు, గర్భిణులు, బాలింతలకు అందజేయాల్సిన కోడి గుడ్లు పక్కదారి పడుతున్నాయన్న ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. ఈ క్రమంలో ప్రభుత్వం అంగన్వాడీ కేంద్రాలకు సరఫరా చేసే కోడిగుడ్ల రవాణా, వాటిని లబ్ధిదారులకు పారదర్శకంగా అందించేందుకు వినూత్న చర్యలు చేపడుతోంది. ఇందులో భాగంగా ప్రతీ గుడ్డుపై ప్రత్యేక ముద్ర వేసి అందించనున్నారు. ఎలాంటి అవకవతకలు జరగకుండా విడతల వారీగా ఒక్కో రంగుతో ముద్రను వేసి సరఫరా చేస్తున్నారు. నెలలో పది రోజులకోసారి కోడిగుడ్లపై ప్రత్యేక రంగుతో కూడిన ముద్రను వేయనున్నారు. ఇందుకోసం రాష్ట్ర వ్యాప్తంగా ఐదు జోన్ల పరిధిలో కాంట్రాక్టర్లకు బాధ్యతలు అప్పగించారు. కోడిగుడ్డు కుళ్లిపోతే కాంట్రాక్టరే బాధ్యత వహించాల్సి ఉంటుందని ప్రభుత్వం స్పష్ట చేసింది.

# వీసీపై వేటు.. అధికారం ఎవరికి

(మొదటిపేజీ తరువాయి)

బోధనేతర ఉద్యోగులు, విద్యార్థులు ఆందోళన చేస్తూ వస్తున్న విషయం తెలిసిందే. ఈ క్రమంలో తెలంగాణ విశ్వవిద్యాలయ ఉపకులపతి వీసీ రవీందర్ గుప్తా లంచం తీసుకుంటూ ఏసీబీకి చిక్కడంతో వ్యవహారం కీలక మలుపు తిరిగింది. అవినీతి ఆరోపణలు ఎదుర్కోవడంతో పాటు ఏకంగా లంచం తీసుకుంటూ అవినీతి నిరోధక శాఖకు చిక్కడంతో ఆయనను వీసీ పదవి నుంచి తొలగించే వ్యవహారంపై చర్చ జరుగుతోంది. వీసీని తొలగించే అధికారం రాష్ట్ర ప్రభుత్వానికి ఉంటుందా.. లేదా గవర్నర్ కు ఉంటుందా అనేది విద్యాశాఖ వర్గాలు చర్చిస్తున్నాయి. విశ్వవిద్యాలయాలకు ఉపకులపతులను నియమించే అధికారం, తొలగించే అధికారం పూర్తిగా గవర్నర్ కు మాత్రమే ఉంటుంది. నియామకానికి సిఫార్సు చేసే అధికారం రాష్ట్ర ప్రభుత్వానికి ఉన్నా.. తొలగించే అధికారం మాత్రం గవర్నర్ కే ఉంటుందని నిబంధనలు పేర్కొంటున్నాయి. ఇదే విషయాన్ని స్వయంగా వీసీ రవీందర్ గుప్తా కూడా పలు సందర్భాల్లో తెలంగాణ వర్సిటీ పాలక మండలి సమావేశాల్లో ప్రస్తావించినట్లు సమాచారం. కాలేజీ విద్యా కమిషనర్ కు తనను ప్రశ్నించే అధికారమే లేదని ఆయన అన్నట్లు అప్పట్లో వార్తలు వచ్చాయి. తనను వీసీగా తొలగించే అధికారం ప్రభుత్వానికి లేదంటూ ఆయన గట్టిగా మాట్లాడిన తీరు అప్పట్లో వార్తల్లో నిలిచింది. ఇదే క్రమంలో అవినీతి ఆరోపణలు ఎదుర్కోవడం, విజిలెన్స్ ఎన్‌ఫోర్స్‌మెంట్ తనిఖీలు చేయడం, తాజాగా లంచం తీసుకుంటూ ఏసీబీకి రెడ్ హ్యాండెడ్ గా పట్టుబడటంతో వీసీ తొలగింపు హాట్ టాపిక్ గా మారింది. ఏదైనా విశ్వవిద్యాలయానికి వైస్ ఛాన్సలర్ ను నియమించడానికి ముందు రాష్ట్ర ప్రభుత్వం నోటిఫికేషన్ ఇస్తుంది. ఈ ప్రక్రియ కోసం ముగ్గురు సభ్యులతో ఓ కమిటీని ఏర్పాటు చేస్తుంది. ఇందులో యూనివర్సిటీ గ్రాంట్స్ కమిషన్ (యూజీసీ) నుంచి ఒకరు, రాష్ట్ర ప్రభుత్వం నుంచి విద్యాశాఖ కార్యదర్శి, వీసీ నియామకం జరిగే వర్సిటీ నుంచి పదవీ విరమణ చేసిన నిపుణుడైన మాజీ వీసీ(సాధారణంగా) మొత్తం ముగ్గురు కమిటీలో ఉంటారు. నోటిఫికేషన్ తర్వాత వచ్చే దరఖాస్తులను కమిటీ పరిశీలించి.. అందులో అర్హతలు ఉన్న ముగ్గురి పేర్లను గవర్నర్ కు పంపుతుంది. ఇందులో నుంచి గవర్నర్ ఒకరిని ఎంపిక చేస్తారు. ఆ తర్వాత గవర్నర్ నియామకానికి సంబంధించిన నియామకపు ఉత్తర్వులు రాష్ట్ర ప్రభుత్వ విద్యాశాఖ కార్యదర్శి ఇస్తారు. గవర్నర్ నియమించిన వీసీ సరైన వ్యక్తి కాదనుకున్నా, అవినీతి ఆరోపణలు ఎదురైనా లేదా రాష్ట్ర ప్రభుత్వానికి ఇష్టం లేకున్నా.. రెండింట మూడొంతుల అసెంబ్లీ మెజారిటీ తీసుకుని వీసీ తొలగింపు ఉత్తర్వులు ఇస్తారు. ఆ తర్వాత అసెంబ్లీ నిర్ణయాన్ని గవర్నర్ కు పంపుతారు. అలాగే గవర్నర్ కు కూడా వీసీ ని కారణాలు లేకుండా తొలగించే అధికారం ఉండదు. అయితే తెలంగాణ వర్సిటీ వీసీ లాంటి సంక్లిష్టమైన వివాదం గతంలో ఎప్పుడూ ఎదురవ్వలేదు. ఏసీబీ దాడి చేసి వీసీని రెడ్ హ్యాండెడ్ గా పట్టుకోవడం పైనా పలు ప్రశ్నలు తలెత్తుతున్నాయి. ఇలా ఏసీబీ దాడి చేయడానికి ముందుగా గవర్నర్ అనుమతి తీసుకోవాల్సిన అవసరం ఉందా అనే విషయంపై ఉన్నతాధికారులు న్యాయ నిపుణుల సలహా తీసుకున్నారు. అయితే వీసీ వేతనం తీసుకుంటున్నారు కాబట్టి, ప్రజా సేవకుడిగానే చూడాలని నిపుణులు తెలిపారు. కాబట్టి ఏసీబీ చట్టం పరిధిలోకి వస్తారని అంటున్నారు. వీసీని సస్పెండ్ చేయడానికి రాష్ట్ర ప్రభుత్వానికి అధికారం ఉంటుందని నిపుణులు చెబుతున్నారు. విచారణలో వీసీ నేరం రుజువైతే ఆయనను శాశ్వతంగా తొలగించే అధికారం కూడా రాష్ట్ర ప్రభుత్వానికి ఉంటుందని చెబుతున్నారు. అయితే ప్రతీ విషయాన్ని గవర్నర్ దృష్టికి తీసుకెళ్లాల్సిన అవసరం మాత్రం ఉంటుందని అంటున్నారు.

# కడపలో స్కెచ్.. హైదరాబాద్‌లో కిడ్నాప్

హైదరాబాద్ - ప్రభాత సూర్యుడు

హైదరాబాద్ మల్కాజిగిరి బాలుడి కిడ్నాప్ కేసులో విస్తుపోయే విషయాలు వెలుగులోకి వస్తున్నాయి. కిడ్నాప్ కు పాల్పడిన నిందితుల్లో నలుగురు పెద్ద వాళు కాగా.. ఓ మైనర్ ఉన్నట్లు తెలుస్తోంది. అయితే ఈ బాలుడే కిడ్నాప్ చేయడంలో కీలక పాత్ర పోషించినట్లు సమాచారం. క్రికెట్ బాల్ కొందామని చెప్పి బయటకు తీసుకు వచ్చి మైనర్ బాలుడు.. హర్ష వర్ధన్ ను కారు ఎక్కించాడట. ఆపై కిడ్నాప్ చేసిన మొదటి రోజు బాలుడిని ఆలేరులోని ఓ ఫాం హౌజ్ లో నిందితులు దాచారు. అక్కడి నుంచి ఇంటికి వెళ్తున్నామని చెప్పి ఓ చోట నుంచి మరో చోటుకు కారులో తిప్పారు. హర్షవర్ధన్ కిడ్నాప్ కేసులో ప్రధాన నిందితుడు కడప జిల్లాకు చెందిన శివగా పోలీసులు గుర్తించారు. ఆన్ లైన్ ట్రేడింగ్ లో శివ భారీగా డబ్బు పోగొట్టుకున్నాడు. నష్టాన్ని పూడ్చుకోవడానికి కిడ్నాప్ కు ప్లాన్ చేశాడు. బాలుడి ప్లాన్ కు కడప నుంచి శివ స్కెచ్ వేయడంతో పాటు అక్కడి నుంచే ప్లాన్ ను అమలయ్యేలా చేశాడు. మైనర్ బాలుడితో సహా ఐదుగురు ముఠాగా ఏర్పడి.. కిడ్నాప్ చేశారు. అయితే తాము అనుకున్నట్లు కిడ్నాప్ సక్సెక్ అయి డబ్బు చేతికి రాగానే బాలుడు గతం గుర్తులు లేకుండా స్నేహితులతో కలిసి సర్జరీ చేయించాలని కూడా నిర్ణయించుకున్నట్లు తెలుస్తోంది. హైదరాబాద్‌లో 8వ తరగతి విద్యార్థి అదృశ్యం తీవ్ర కలకలం రేపింది. మల్కాజిగిరిలో నివాసం ఉంటున్న రియల్ ఎస్టేట్ వ్యాపారి కుమారుడు హర్ష వర్ధన్ ఈనెల 16వ తేదీన కనిపించకుండా పోయాడు. తల్లిదండ్రుల ఫిర్యాదు మేరకు రంగంలోకి దిగిన పోలీసులు 36 గంటల్లో కేసులు ఛేదించారు. సీసీటీవీ ఫుటేజీ, ఇతర వివరాల ఆధారంగా చేసుకొని పోలీసులు దర్యాప్తు చేపట్టారు. కారులో బాలుడిని కిడ్నాప్ చేసిన నలుగురు వ్యక్తులను రామన్నగూడెం వద్ద పోలీసులు పట్టుకున్నారు. బాలుడిని క్షేమంగా తల్లిదండ్రులకు అప్పగించారు. వరంగల్ లో బాలిక కిడ్నాప్ కలకలం రేగింది. వరంగల్ మిల్స్ కాలనీ పోలీస్ స్టేషన్ పరిధిలోని నాగేంద్ర నగర్ లోని 4వ తరగతి చదువుతున్న ముతుల్ అనే బాలిక కొబ్బరి నూనె తెచ్చేందుకు కిరాణా షాపు వెళ్లగా, అక్కడ గుర్తు తెలియని ముగ్గురు వ్యక్తులు కర్చీఫ్ లో మత్తుమందు పెట్టి బాలికను కిడ్నాప్ చేశారు. బాలికను ఓ వ్యాన్లో తీసుకెళ్తున్న క్రమంలో వరంగల్ గణపతి ఇంజినీరింగ్ కళాశాల వద్ద దుండగులు వ్యాన్ ఆపి టీ తాగుతుండగా, బాలికకు స్పృహ రావడంతో వాళ్ల చెర నుంచి తప్పించుకొని పారిపోయి వచ్చింది. అక్కడే ఉన్న కొందరు వ్యక్తులు క్షేమంగా తల్లిదండ్రులకు అప్పగించారు. టాటా ఏస్ లో వచ్చిన ముగ్గురు దుండగులు అక్కడి నుంచి పారిపోయారని స్థానికులు అంటున్నారు. ఈ ఘటనపై బాలిక తల్లిదండ్రులు పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేశారు. “పాప షాపునకు వెళ్లింది. అమ్మాయి రోడ్డు దాటేవరకూ అక్కడే నిలబడ్డాను. పది నిమిషాలు అయినా ఇంకా పాప రాలేదు. మా అబ్బాయిని పంపి షాపు వద్ద అడిగితే ఎవరు రాలేదని చెప్పారు. ఈ విషయాన్ని నా భర్తకు చెప్పాను. బంధువుల ఇంటికి వెళ్లిందేమోనని అక్కడ కూడా చూశాం, కానీ అక్కడికీ వెళ్లలేదు. ఇంతలో డయల్ 100కు ఫోన్ చేసి పోలీసులకు ఫిర్యాదు చేశాను. పాప వరంగల్ లో ఉందని ఫోన్ వచ్చింది. అక్కడికి ఎలా వచ్చిందని అడిగితే ఎవరో వ్యాన్ లో తీసుకొచ్చారని బాలిక చెప్పింది. దీనిపై పోలీసులు ఫిర్యాదు చేశాం. “- బాలిక తల్లి

# మెగా ఫ్యామిలీలో సంబర వాతావరణం

హైదరాబాద్ - ప్రభాత సూర్యుడు

మెగా కుటుంబంలో సంబర వాతావరణం నెల కొంది. అందుకు కారణమేంటో ప్రత్యేకంగా చెప్పనకర్లేదు. మెగాస్టార్ చిరంజీవి తనయుడు, హీరో మెగా పవర్‌స్టార్ రామ్‌చరణ్, ఉపాసన దంపతులు తల్లిదండ్రులయ్యారు. సోమవారం రాత్రే అపోలో హాస్పిటల్‌లో జాయిన్ అయిన ఉపాసన.. మంగళవారం తెల్లవారు జామున ఆడబిడ్డకు జన్మనిచ్చారు. తల్లీ బిడ్డ ఆరోగ్యంగా ఉన్నారు. రీసెంట్ గానే రామ్‌చరణ్, ఉపాసన తమ 11వ పెళ్లిరోజును సెలబ్రేట్ చేసుకున్నారు. ఇప్పుడు మరో శుభవార్తను తెలియజేశారు. వీరికి 2012లో వివాహం అయ్యింది. పాప పుట్టిన సంగతి తెలియ గానే కుటుంబ సభ్యులతో పాటు అభిమానులు సంతోషంగా ఉన్నారు. భర్త రామ్‌చరణ్‌తో పాటు తల్లి శోభన కామినేని, అత్తమ్మ సురేఖ కొణిదెలతో కలిసి అపోలో ప్రో హెల్త్ హాస్పిటల్‌కు ఉపాసన వెళ్లారు. ఆ వీడియో నెట్టింట వైరల్ అయ్యింది. డిసెంబర్‌లో రామ్ చరణ్, ఉపాసన కలిసి తాము పేరెంట్స్ కాబోతున్నామంటూ అధికారికంగా చేసిన ప్రకటనతో మెగా అభిమానులు సంబరాలు చేసుకున్నారు. ఆ మధ్య ఓ సందర్భంలో చిరంజీవి మాట్లాడుతూ జూలైలో చరణ్, ఉపాసనలకు బిడ్డ పుట్టే అవకాశం ఉందని తెలిపారు. అయితే ఇంకా ముందుగానే వారింట సంబర వాతావరణం నెలకొంది. మరో వైపు హీరో రామ్ చరణ్ సైతం సినిమా షూటింగ్స్ నుంచి బ్రేక్ తీసుకుని మరీ తన సమయాన్నంతా ఉపాసనకే కేటాయిస్తూ వస్తున్నారు. ఆయన దర్శకుడు శంకర్‌తో కలిసి గేమ్ చేంజర్ అనే భారీ సినిమా చేస్తున్న సంగతి విదితమే. జూలై నెలలో శంకర్ మూవీకి సంబంధించిన షెడ్యూల్ ప్లాన్ చేసుకున్నారు. అయితే ఇప్పుడు రామ్‌చరణ్ రిక్వెస్ట్ మేరకు షెడ్యూల్‌ను ఆగస్ట్‌కి మార్చారు. అందుకు కారణం ఉపాసనకు డెలివరీ అయిన కొన్ని రోజుల వరకు రామ్ చరణ్ ఫ్యామిలీతోనే తన సమయం గడపాలని నిర్ణయించుకోవటమే అందుకు కారణమని వార్తలు వైరల్ అవుతున్నాయి. ఈ భారీ బడ్జెట్ పాన్ ఇండియా మూవీ వచ్చే ఏడాదిలో రిలీజ్ అవుతుంది. పొలిటికల్ బ్యాక్ డ్రాప్‌తో తెరకెక్కుతోన్న ఈ చిత్రంలో రామ్ చరణ్ ద్విపాత్రాభినయం చేస్తున్నారు. కియారా అద్వాని హీరోయిన్. దిల్ రాజు, శిరీష్ నిర్మాతలు.


# పోలీసుల వేధింపులతో యువకుడి ఆత్మహత్య

నంద్యాల- ప్రభాత సూర్యుడు

పోలీసుల వేధింపులు తాళలేక ఓ యువకుడు ఆత్మహత్య చేసుకున్న ఘటన ఏపీలోని నంద్యాలలో జరిగింది. మహానంది మండలం గోపవరం వద్ద రైలు కింద పడి చినబాబు ఆత్మహత్య చేసుకున్నాడు. వివరాల్లోకి వెళ్తే బైక్ చోరీ కేసులో నంద్యాల పోలీసులు తనను అక్రమంగా ఇరికించారని, చేయని నేరానికి తనను బాగా కొట్టారని చినబాబు అనే యువకుడు సెల్ఫీ వీడియోలో పేర్కొన్నాడు. అందుకే మనస్థాపంతో చనిపోతున్నట్లు వీడియోలో తెలిపాడు. ఎస్ఐ సుబ్బరామిరెడ్డి, కానిస్టేబుళ్లు నాగన్న, ఏసుదాసు తనను తీవ్రంగా వేధించారని బాధితుడు సెల్ఫీ వీడియోలో తెలిపాడు. మృతుడు చినబాబు స్వస్థలం నంద్యాల తోటలైను వీధి.

# జడ్పీ సమావేశంలో గల్ఫ్ అమరులకు
# సంతాప తీర్మానం ఆమోదించాలి

## గల్ఫ్ అమరులను స్మరించి గౌరవించండి



జగిత్యాల - ప్రభాత సూర్యుడు : రాష్ట్ర అవతరణ దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా అమర వీరుల సంస్మరణను పురస్కరించుకుని ఈ నెల 22 న జరుగనున్న జగిత్యాల జిల్లా పరిషత్ ప్రత్యేక సమావేశంలో గల్ఫ్ దేశాలలో అమరులైన తెలంగాణ కార్మికులకు సంతాపం తెలుపుతూ ఒక తీర్మానాన్ని ఆమోదించాలని గల్ఫ్ జెఏసి బృందం మంగళవారం మన్నెగూడెం గ్రామంలో జడ్పీ చైర్ పర్సన్ దావ వసంత -సురేష్ ను కలిసి వినతిపత్రం సమర్పించారు. గల్ఫ్ జెఏసి చైర్మన్ గుగ్గిల్ల రవిగౌడ్, ప్రధాన కార్యదర్శి స్వదేశ్ పరికిపండ్ల ఆ వినతిపత్రంపై సంతకాలు చేశారు. నీళ్లు - నిధులు - నియామకాలు బొగ్గుబాయి - బొంబాయి - దుబాయి... అనే నినాదాలతో ప్రత్యేక రాష్ట్రం సాధించుకున్నాం. ప్రత్యేక తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన 2014 జూన్ 2 నుండి ఇప్పటి వరకు గత తొమ్మిది సంవత్సరాలలో... తెలంగాణకు చెందిన 1,800 కి పైగా కార్మికులు గల్ఫ్ దేశాలలో మృతి చెందారు. 2014 కంటే ముందు కూడా వేలాది మంది కార్మికులు గల్ఫ్ దేశాలలో అమరులయ్యారు. ఎడారి దేశాలలో పనిచేసే తెలంగాణ వలస కార్మికులు తాము సంపాదించిన సొమ్మును విదేశీ మారకద్రవ్యం రూపంలో స్వదేశానికి పంపిస్తున్నారు. దేశ, రాష్ట్ర ఆర్థిక వ్యవస్థల బలోపేతంలో భాగస్వాములవుతున్నారు. దేశ సరిహద్దుల్లో పనిచేసే సైనికుల తరహాలోనే వీరు కూడా కుటుంబాలను వదిలి దూర తీరాలకు వెళ్లి మాతృభూమి రుణం తీర్చుకుంటున్నందున వారిని స్మరించి సంతాప తీర్మానం చేయాలని ఆ వినతిపత్రంలో కోరారు. గల్ఫ్ మృతుల కుటుంబాలను ఆదుకోవడానికి రాష్ట్ర ప్రభుత్వం రూ. 5 లక్షల ఎక్స్ గ్రేషియా చెల్లించాలి. గల్ఫ్ కార్మికుల సంక్షేమానికి రూ. 500 కోట్ల వార్షిక బడ్జెట్ కేటాయించాలి. ప్రవాసి భారతీయ బీమా యోజన అనే రూ.10 లక్షల విలువైన ప్రమాద బీమా పథకంలో సహజ మరణంను కూడా చేర్చాలని కోరారు.

### చల్‌గల్ గ్రామంలో
## ఎమ్మెల్యే జీవన్ రెడ్డి పర్యటన




జగిత్యాల - ప్రభాత సూర్యుడు : జగిత్యాల రూరల్ మండలం చల్ గల్ గ్రామంలో ఈ నెల 16న ప్రమాదవశాత్తూ అగ్నికి ఆహుతి అయిన ఈత వనంలో గీతా కార్మికులకు ఇచ్చిన హామీ మేరకు మంగళవారం పట్టభద్రుల ఎమ్మెల్సీ తాటిపర్తి జీవన్ రెడ్డి బావి, పైపు లైన్ల ఏర్పాటు కోసం రు.5 లక్షల సీడీపీ నిధులతో భూమి పూజ చేశారు. ఈ సందర్భంగా గీత కార్మికులు జీవన్ రెడ్డి కి అభిమానంతో కల్లు పోసి తమ ఆప్యాయతను చాటుకున్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ జీవన్ రెడ్డి మాట్లాడుతూ ప్రకృతి వైపరీత్యాలతో నష్ట పోయిన గీత కార్మికులను ప్రభుత్వం ఆదుకోవాలని అన్నారు. అగ్ని ప్రమాదంలో చెట్లు కాలిపోయి, ఉపాధి కోల్పోయిన గీతా కార్మికులకు పరిహారం అందించి, గీత కార్మిక వృత్తికి భరోసా కల్పించాలని డిమాండ్ చేశారు.

### హుక్కా సెంటర్ పై
## పోలీసుల దాడి..20 మంది అరెస్టు




రంగారెడ్డి - ప్రభాత సూర్యుడు : రంగారెడ్డి జిల్లా మైలార్ దేవ్ పల్లి పోలీస్ స్టేషన్ పరిధిలోని అర్ధరాత్రి ఎలాంటి అనుమతులు లేకుండా హుక్కా సెంటర్ ను నడిపిస్తున్న యువకులతో పాటు హుక్కా సేవిస్తున్న 20 మంది యువకులను పక్కా సమాచారం మేరకు ఎస్ఓటి పోలీసుల దాడులు నిర్వహించారు యువకులందరినీ మైలార్ దేవ్ పల్లి పోలీస్ స్టేషన్ కి తరలించారు హుక్కా సెంటర్ ని సీజ్ చేసి కేసు ఎస్వోటీ పోలీసులుహుక్కా పాట్లతో సహా సీజ్ చేసి పోలీస్ స్టేషన్ కి అప్పగించారు. కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు ముమ్మరం చేస్తున్నారు.

### పెరిగిన ఎండలు.. మండుతున్న
## కూరగాయల రేట్లు




హైదరాబాద్ - ప్రభాత సూర్యుడు : ఎండలతో పాటు నగరంలో కూరగాయల ధరలూ భగ్గుమంటున్నాయి. రైతు బజార్లతో పాటు హోల్‌సేల్ మార్కెట్లలో రేట్లు అమాంతంగా పెరగడంతో సామాన్యులు విలవిలలా డుతున్నారు. గుడిమల్కాపూర్, బోయిన్‌పల్లి, సికింద్రాబాద్, ఎల్‌బీనగర్, మోండా మార్కెట్లతో పాటు సరూర్‌నగర్, మెహిదీపట్నం, ఎర్రగడ్డ, కూకట్‌పల్లి లాంటి రైతు బజార్లకు పెద్ద ఎత్తున కూరగాయలు వస్తుంటాయి. శివారులోని మొయినాబాద్, ఇబ్రహీంపట్నంతో పాటు ఏపీ, కర్ణాటక, మహారాష్ట్ర నుంచి క్వింటాళ్ల కొద్దీ కూరగాయలు వస్తుంటాయి. సరూర్‌నగర్ రైతుబజార్‌కు సాధారణంగా నిత్యం 40 క్వింటాళ్ల టమాట, 30 నుంచి 35 క్వింటాళ్ల వరకు పచ్చిమిర్చి, వంకాయ 30 క్వింటాళ్లు, బెండకాయ 32 క్వింటాళ్లు, క్యారట్ 35 క్వింటాళ్ల వరకు వస్తుంటాయి. పెరిగిన ఉష్ణోగ్రతల కారణంగా దిగుబడి లేకపోవడంతో ఇక్కడికి దిగుమతి కూడా భారీగా తగ్గింది. ప్రస్తుతం ఇదే రైతుబజార్‌లో సాధారణ రోజులతో పోల్చితే 40 శాతం దిగుమతి తగ్గిపోవడంతో ధరలు పెరిగాయి. రూ. వందకు కిలో టవటా, కిలో పచ్చిమిర్చి కూడా రావడం లేదని సామాన్యులు వాపోతున్నారు. ఎండల తీవ్రతకు కోళ్లు చనిపోతున్నాయంటూ రెండు వారాలుగా వ్యాపారులు చికెన్ ధరను పెంచేశారు. ఆదివారం కూడా పలు ప్రాంతాల్లో స్కిన్‌లె?స కిలో రూ.280 నుంచి రూ.300 వరకు, లైవ్ కోడి రూ.190 నుంచి రూ.210 వరకు అమ్మారు. దీంతో చాలామంది చేపలు కొనుగోలు చేసేందుకు ఆసక్తి చూపారు. లైవ్‌ఫిష్ కిలో రూ.180, ఇతర చేపలు రూ.150, మండుతున్న ఎండలతోపాటు కొత్త పంట రాకపోవడంతో ధరలు పెరుగుతున్నాయని సరూర్‌నగర్ రైతుబజార్ అధికారి స్రవంతి 'ఆంధ్రజ్యోతి'కి తెలిపారు. ఆగస్ట్ మొదటి వారం వరకు ధరలు ఇలాగే ఉంటాయని, వర్షాలు ప్రారంభమైన

### సీనియర్ సిటీజన్ల నేత్ర దానం
## అంగీకార పత్రాలు అందజేత



జగిత్యాల - ప్రభాత సూర్యుడు : తెలంగాణ ఆల్ సీనియర్ సిటీజన్స్ అస్సోసియేషన్ జగిత్యాల జిల్లా శాఖ ఆధ్వర్యంలో నేత్ర దాన సంకల్పం నిర్వహించారు. మంగళవారం హౌజింగ్ బోర్డు కాలనీ లో ప్రపంచ వయోధికులపై వేధింపుల నివారణకు నిర్వహిస్తున్న అవగాహన వారోత్సవాల సందర్భంగా 36 మంది సీనియర్ సిటీజన్లు నేత్ర దానానికి అంగీకరిస్తూ తెలంగాణ ఆల్ సీనియర్ సిటీజన్స్ అస్సోసియేషన్ రాష్ట్ర కార్యదర్శి,జిల్లా అధ్యక్షుడు హరి ఆశోక్ కుమార్ కు అంగీకార పత్రాలు అందించారు. ఈ సందర్భంగా హరి ఆశోక్ కుమార్ వయోధికుల వేధింపుల నివారణ వారోత్సవాల ఉద్దేశ్యంను వివరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ప్రపంచ వయోధికుల పై వేధింపుల నివారణ వారోత్సవాల సందర్భంగా తమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు పి.నర్సింహారావు సూచనలు మేరకు నిర్వహిస్తున్న వివిధ చైతన్య కార్యక్రమాల్లో భాగంగా నేత్ర దానం పట్ల తప్పుడు మూఢ నమ్మకాలను తొలగించడం తో సీనియర్ సిటీజన్స్ సైతం నేత్రదానానికి ముందుకు వస్తున్నారని,స్వచ్ఛంద సంఘాలు ప్రచార కార్యకర్తలుగా మారాలని కోరారు. నేత్ర దానానికి అంగీకార పత్రాలను అందించిన వారిని సంఘం తరపున మెమోంటో.లు అందజేసి సన్మానించారు. ఈ కార్యక్రమంలో జిల్లా గౌరవ అధ్యక్షుడు జీ.ఆర్.దేశాయ్, మున్సిపల్ కౌన్సిలర్లు పంబాల రాం కుమార్,కూసరి అనిల్ కుమార్, సీనియర్ సిటీజన్స్ జిల్లా ప్రధాన కార్యదర్శి గౌరిశెట్టి విశ్వనాథం,ఉపాధ్యక్షులు పి.సి.హన్మంత్ రెడ్డి,బొల్లం విజయ్,ఎం.డి.యాకూబ్,కోశాధికారి వెలముల ప్రకాష్ రావు,నాయకులు మానాల కిషన్,పి.ఆశోక్ రావు,కొయ్యడ సత్యనారాయణ,నారాయణ,ప్రేమ్ సాగర్, ప్రసాద్, పబ్బా శివానందం,సింగం గంగాధర్,తదితరులు పాల్గొన్నారు.

### అంగరంగ వైభవంగా
## బల్కంపేట ఎల్లమ్మ కల్యాణోత్సవం



సనత్‌నగర్ - ప్రభాత సూర్యుడు : బల్కంపేట ఎల్లమ్మ కల్యాణోత్సవం అంగరంగ వైభవంగా కొనసాగింది. ఉదయం 9.30 గంటలకు ఈ కల్యాణోత్సవం ప్రారంభమైంది. ఎల్లమ్మ అమ్మవారి కల్యాణాన్ని ప్రజలు టీవీల్లో వీక్షించేలా ప్రత్యక్ష ప్రసారం చేసినట్లు నిర్వాహకులు తెలిపారు. అదేవిధంగా వివిధ ప్రాంతాల నుంచి భక్తులు ఆలయానికి చేరుకునేలా ప్రత్యేక బస్సులు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఏటా ఆషాడ మాసం మొదటి మంగళవారం బల్కంపేట ఎల్లమ్మ తల్లి కల్యాణం అత్యంత వైభవంగా జరుగుతుంది. కల్యాణానికి ప్రభుత్వం తరపున మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్ కుటుంబసమేతంగా హాజరై పట్టువస్త్రాలు సమర్పించారు. కాగా, అమ్మవారి కల్యాణాన్ని తిలకించేందుకు లక్షలాది మంది భక్తులు తరలివస్తారు. ఎప్పటిలాగే ఈ ఏడాది కూడా భక్తులు భారీగా కల్యాణోత్సవానికి విచ్చేశారు. భక్తులకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా అధికారులు అన్ని ఏర్పాట్లు చేశారు. అయితే, బల్కంపేట ఎల్లమ్మ కల్యాణోత్సవాల్లో భాగంగా సోమవారం ఘనంగా ఎదుర్కోళ్లు నిర్వహించారు. ఇవాళ అంగరంగ వైభవంగా ఎల్లమ్మ కల్యాణం చేస్తున్నారు. చివరిగా రేపు సాయంత్రం రథోత్సవం నిర్వహిస్తారు. అంతటితో అమ్మవారి కల్యాణోత్సవాలు ముగుస్తాయి.

### జరిగిన అభివృద్ధికి
## దశాబ్ది ఉత్సవాలు నిదర్శనం

**అభివృద్ధి జరగలేదని నిరూపిస్తే క్షమాపణలకు సిద్ధం**
**జరిగిన అభివృద్ధి నిరూపిస్తే ముక్కులు నేలకు రాస్తారా**
**అదీ గల్లీ నుండి ఢిల్లీ వరకు**
**కాంగ్రెస్ నేతలకు మంత్రి జగదీష్ రెడ్డి సవాల్**



నల్గొండ -ప్రభాత సూర్యుడు : ముఖ్యమంత్రి కేసీఆర్ నేతృత్వంలో తొమ్మిది సంవత్సరాలుగాజరిగిన అభివృద్ధికి జరుగుతున్న దశాబ్దిఉత్సవాలు తార్కాణమని రాష్ట్ర విద్యుత్ శాఖామంత్రి గుంటకండ్ల జగదీష్ రెడ్డి స్పష్టం చేశారు. అధికారిక లెక్కలు జరిగిన అభివృద్ధికి నిలువెత్తు నిదర్శనమన్నారు. రాష్ట్ర అవతరణ దశాబ్దిఉత్సవాలలో బాగంగా మంగళవారం నల్గొండ జిల్లా కేంద్రంలో జరిగిన విద్యా దినోత్సవ వేడుకలలో మంత్రి జగదీష్ రెడ్డి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా జరిగిన సభలో గడిచిన తొమ్మిదేళ్ల వ్యవధిలో ఉమ్మడి నల్లగొండ జిల్లా విద్యా రంగంలో సాధించిన విజయాలను ఆయన గణాంకాలతో సహా సోదాహరణంగా వివరించారు. అదే సందర్భంగా ఇతర జిల్లాకు చెందిన కాంగ్రెస్ నేత ముఖ్యమంత్రి కేసీఆర్ క్షమాపణలు చెప్పాలి అంటూ చేసిన డిమాండ్ పై ఆయన ఘాటుగా స్పందించారు. తొమ్మిదేళ్ల వ్యవధిలో ముఖ్యమంత్రి కేసీఆర్ నేతృత్వంలోని రాష్ట్ర ప్రభుత్వం సాధించిన అభివృద్ధిని నిరూపిస్తే కాంగ్రెస్ నేతలు ముక్కులు నేలకు రాస్తారా అంటూ మంత్రి జగదీష్ రెడ్డి సవాల్ విసిరారు. అభివృద్ధి జరగలేదని నిరూపిస్తే క్షమాపణ చెప్పేందుకు తాము సిద్ధంగా ఉన్నమాన్నారు.

### ట్రాఫిక్ వేధింపులంటూ
## స్కూటీకి నిప్పంటించాడు

రంగారెడ్డి - ప్రభాత సూర్యుడు : నిత్యం ట్రాఫిక్ పోలీసుల తనిఖీలు, ఛలాన్లతో ఆ యువకుడికి చిర్రెత్తిపోయింది. సహనం అడుగంటింది. దాంతో తన నిరసన వ్యక్తం చేయడానికి తన వాహానానికి నిప్పటించాడు. ఇది శంషాబాద్ లో జరిగింది. శంషాబాద్‌లో ట్రాఫిక్ పోలీసుల వేధింపులను భరించలేక స్కూటీకి యువకుడు నిప్పు అంటించాడు. శంషాబాద్ పరిధిలోని కిషన్ గూడ వద్ద ఎయిర్పోర్ట్ బ్రిడ్జి కింద ఘటన జరిగింది. స్కూటీ వాహనాన్ని ఆపి పెండింగ్ చాలానాలు చెక్ చేస్తుండడం తో ట్రాఫిక్ పోలీసుల వేధింపులను నిరసిస్తూ ఫసియుద్దీన్ తన స్కూటీకి నిప్పంటించాడు. అప్రమత్తమయిన పోలీసులు మంటలు ఆర్పి వేసారు.

Printed, Published and Owned by CHERUKU UPENDAR, Printed at Akshaya Printers, H/No: 7-83/2, HANUMAN NAGAR COLONY, KUNTLOOR, ABDULLA-PURMET MANDAL, HAYATH NAGAR, PIN:501505, RANGAREDDY DISTRICT/ HYDERBAD CITY, TELANAGANA, EDITOR CHERUKU UPENDAR, PUBLICA-TION at HAMSA PUBLICATIONS, H/No: 7-83/2, HANUMAN NAGAR COLONY, KUNTLOOR, ABDULLAPURMET MANDAL, HAYATH NAGAR, PIN:501505, RANGAREDDY DISTRICT/ HYDERBAD CITY, TELANAGANA, E-mail: upendrabbk@gmail.com